# యువకుడి ఆత్మహత్య



మైత్రి నవీన్(ఫైల్)

వేములవాడ, అక్టోబర్ 15: తెలిసీ తెలియని వయసులో 27 ఏళ్ల వయసున్న వివాహితతో ఏర్పడిన ప్రేమ బెడిసి కొట్టడంతో యువకుడు మైత్రి నవీన్ (19) మంగళవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వేములవాడ రాజన్న ఆలయం ఎదుట బెల్లం దుకాణంలో దినసరి కూలీగా పనిచేసే నవీన్ 27 సంవత్సరాల వయసున్న వివాహితతో ప్రేమలో పడ్డాడు. సదరు వివాహిత ఇటీవలే పండుగకు ఇంటికివెళ్లగా నిన్ను చూడాలంటూ ఫోన్‌చేసి అడిగాడు. దీంతో ఆమె నిరాకరించి, ఇక ముందు రావద్దని తేల్చి చెప్పినట్లుగా స్థానికుల ద్వారా తెలిసింది. దీంతో చేతిపై కోసుకుంటూ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ పెట్టి గుడి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లుగా పోలీసులు తెలిపారు. అయితే నవీన్ నెల రోజుల క్రితం కూడా పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకోగా కరీంనగర్‌లోని ఒక దవాఖానలో చికిత్స అందించారు. తోటి గుమస్తాల సహాయంతో బయటపడిన నవీన్ నెల రోజుల్లోనే మరోసారి ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడని స్థానికులు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పట్టణ సీఐ వీర ప్రసాద్ తెలిపారు.

# ఫీజు బకాయిలు విడుదల చేయండి

- అంబేద్కర్ చౌరస్తా వద్ద డిగ్రీ కళాశాలల నిర్వాహకుల నిరసన

తెలంగాణ చౌక్, అక్టోబర్ 15: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిగ్రీ కళాశాల సంఘ నేత కొలనూరు శేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం శాతవాహన యూనివర్సిటీ డిగ్రీ, పీజీ కళాశాల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తా వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, భవనాల అద్దెలు, అధ్యాపకుల వేతనాలు, నిర్వహణ ఖర్చుల కోసం చేసిన అప్పులు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వంలో ఉన్న మంత్రుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయిందని వాపోయారు. ఉన్నత విద్యను నీరుగారుస్తున్న ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరించడంతో వేల మంది విద్యార్థులు భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిందని పేర్కొన్నారు. ఇక్కడ గుగ్గిళ్ల జగన్ గౌడ్, గెంట్యాల భూమేశ్, బాల్‌రెడ్డి, రాజేశ్ తదితరులున్నారు.




అంబేద్కర్ చౌరస్తా వద్ద నిరసన తెలుపుతున్న డిగ్రీ కళాశాలల నిర్వాహకులు

### నేడు ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం

ముస్తాబాద్, అక్టోబర్ 15 : పలు గ్రామాల్లో బుధవారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు.

















